PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com

epaper.vaarthasadhya.com

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు వార్త సంధ్య టీవీ కోసం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
గ్రేటర్ హైదరాబాద్ మరియు రంగారెడ్డి
జిల్లాలోని అన్ని డివిజన్, మండలాలలో కావలెను.

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు మండల స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7369122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

13-22/43, Plot No:203, VV Nagar Colony, Gaddiannaram, Ranga Reddy Dist. - Hyderabad, Telangana 500060

Published From : Rangareddy | VOLUME : 01 | Issue : 244 | Sunday 23-08-2026 | Editor : Seggem Kiran Kumar | Pages : 08 | Price : 6/-

## భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం

ప్రపంచ ఆశాకిరణంగా భారత్: ప్రధాని

వరల్డ్ లీడర్స్ ఫోరంలో కీలక ప్రసంగం

ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహక విధానాలు

స్థిరత్వమే దేశ ప్రగతికి పునాది



న్యూఢిల్లీ, ఆగస్టు 22 (వార్త సంధ్య): ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అభివృద్ధి, ఆశలకు ప్రతీకగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం–2026లో ప్రసంగించిన ఆయన, ప్రపంచం నేడు భారత్‌ను వృద్ధి, అవకాశాలు, స్థిరత్వానికి కేంద్రంగా చూస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన సంస్కరణలను అమలు చేస్తోందని చెప్పారు. విధానపరమైన మార్పులతో పాటు పాలనా వ్యవస్థలో కూడా తదుపరి తరం సంస్కరణలను చేపడుతున్నామని ప్రధాని తెలిపారు. గతంలో ఉత్పత్తి పెంచిన సంస్థలను శిక్షించే విధానాలు ఉండేవని, ప్రస్తుతం

మిగతాది 2 పేజీలో

# నీట్ విద్యార్థిని హత్యతో దేశవ్యాప్తంగా సంచలనం

- ప్రియుడి గదిలో బాత్రూంలో కుళ్లిన మృతదేహం
- గొంతు కోసి హత్య చేసినట్లు అనుమానం
- పరారీలో ప్రధాన నిందితుడు వివేక్ చౌబే
- బ్లాక్‌మెయిల్, అత్యాచారం కోణాల్లో దర్యాప్తు



**వారణాసి, ఆగస్టు 22 (వార్త సంధ్య):** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసీలో నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ యువతి దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపుతోంది. వైద్య విద్యలో ప్రవేశం సాధించి డాక్టర్ కావాలన్న ఆమె కలలు విషాదాంతమయ్యాయి. ఆగస్టు 18న కళాశాలకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన యువతి ఆ తర్వాత కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మూడు రోజుల తర్వాత ఆమె మృతదేహం ప్రియుడు వివేక్ చౌబే అద్దెకు ఉంటున్న గదిలోని బాత్రూంలో కుళ్లిన స్థితిలో లభించడం సంచలనంగా మారింది.

యువతి అదృశ్యంపై పోలీసులు ఆమె మొబైల్ ఫోన్ సంకేతాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. చివరిసారిగా ఆమె ఫోన్ వారణాసిలోని మాలవీయ ఇంటర్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో పనిచేసినట్లు గుర్తించారు. ఇదే సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు కూడా తమవంతుగా గాలింపు చేపట్టారు. మీర్జాపూర్ జిల్లాలోని సీఖర్ గ్రామంలో ఉన్న వివేక్ చౌబే మేనమామ ఇంట్లో యువతికి చెందిన బ్యాగ్ కనిపించడంతో అనుమానం మరింత బలపడింది.

బ్యాగ్‌లో లభించిన తాళం చెవిని తీసుకుని వివేక్ ఉంటున్న గదికి వెళ్లి పరిశీలించగా బాత్రూం నుంచి దుర్వాసన రావడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. తలుపు తెరిచి చూడగా యువతి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అధికారులు ఘట-

మిగతాది 2 పేజీలో

## తాజా వార్తలు

### ఒడిశా నుంచి తెలంగాణకు హషీష్ ఆయిల్ రవాణా



### రూ.1.75 కోట్ల విలువైన 14.2 కిలోల హషీష్ ఆయిల్ స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య): ఒడిశా నుంచి తెలంగాణకు హషీష్ ఆయిల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్ రాకెట్‌ను ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌ఓటీ, నాగోల్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు 14.2 కిలోల హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.75 కోట్లు ఉంటుందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ తెలిపారు.

మిగతాది 2 పేజీలో

## పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

### హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం



జర్నలిజం కేవలం వ్యాపారం కాదు.. అదొక సామాజిక బాధ్యత: భట్టి విక్రమార్క

పాలకులను ప్రశ్నించే స్వేచ్ఛే ప్రజాస్వామ్యానికి బలం

డిజిటల్ యుగంలో జర్నలిస్టులకు విశ్వసనీయతే ప్రధాన ఆయుధం

జిల్లా, గ్రామీణ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** ప్రజాస్వామ్య పరిరక్షణకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన **'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'**ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 'ది హిందూ' మాజీ ఎడిటర్ ఎన్. రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సంగీత బారోచ్, 'కరవన్' పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధి గౌతమ్ లాహిరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ భారతీయ జర్నలిజం వారసత్వం, ప్రస్తుత సవాళ్లను వివరించారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం వార్తలుగా అందించడం మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న వాస్తవాలను ప్రశ్నించి ప్రజల ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందన్నారు. వివక్షను ప్రశ్నించడం పత్రికల బాధ్యతగా పేర్కొన్నారు.

ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున

మిగతాది 7 పేజీలో

## 22ఏ నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరిచ్చారు?: హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య): నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు "30 శాతం కమిషన్ సర్కార్" అని అంటున్నారని ఆయన ఆరోపించారు.

బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ఏ బాధితులు తనను కలిసి తమ సమస్యలను వివరించారని హరీశ్‌రావు తెలిపారు. వారి ఆవేదన వింటుంటే గుండె కలిచివేసిందన్నారు.

సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో సుమారు 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా దాదాపు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు విమర్శించారు. ఏళ్లుగా చట్టబద్ధంగా నివసిస్తున్న ప్రజలు తమ అవసరాల కోసం ఇళ్లను విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లినప్పుడు ఆస్తులు ప్రా-

మిగతాది 4 పేజీలో

వార్త సంధ్య



## సంపాదకీయం

### అఖండ భారత్ – ఐక్యతే బలం

భారతదేశం అనేది కేవలం భౌగోళిక సరిహద్దులతో కూడిన దేశం కాదు. వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, ఆధ్యాత్మిక విలువలతో ముడిపడిన మహోన్నత నాగరికత. విభజనలు ఎన్నో ఎదురైనా భారతీయుల హృదయాల్లో ఉన్న సాంస్కృతిక ఐక్యత చెదరలేదు. "అఖండ భారత్" అనే భావనను రాజకీయ విస్తరణగా కాకుండా, భారత ఉపఖండ ప్రజల మధ్య చారిత్రక, సాంస్కృతిక, మానవీయ బంధాలను గుర్తుచేసే ఆలోచనగా చూడాలి.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి ఉన్న అతి పెద్ద బలం. మతం, భాష, ప్రాంతం, కులం వంటి భేదాలను అధిగమించి దేశ సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. పొరుగు దేశాలతో శాంతి, స్నేహం, పరస్పర గౌరవం పెంపొందించుకోవడం కూడా ఈ భావనకు బలాన్నిస్తుంది.

అఖండ భారత్ ఆకాంక్ష కంటే ముందుగా అఖండ భారతీయ చైతన్యం అవసరం. దేశ ఐక్యత, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు బలమైన, సమగ్ర భారతదేశాన్ని అందించడమే మన నిజమైన లక్ష్యం.

# ఒడిశా నుంచి తెలంగాణకు హషీష్ ఆయిల్

(మొదటి పేజీ తరువాయి..)

గౌరెల్లి క్రాస్‌రోడ్ వద్ద పట్టివేత శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బి. సుమతి మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ ఎల్బీనగర్ జోన్ బృందం, నాగోల్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారని తెలిపారు. ఆగస్టు 21న మధ్యాహ్నం నాగోల్‌లోని గౌరెల్లి రోడ్డు వైపు ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై హషీష్ ఆయిల్‌ను తరలిస్తున్నారనే సమాచారం అందిందన్నారు.దీంతో గౌరెల్లి క్రాస్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా ఏపి39ఆర్ వి6425 నంబర్ గల యమహా యంటి -15 బైక్‌పై వస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా హషీష్ ఆయిల్ ప్యాకెట్లు బయటపడ్డాయని తెలిపారు.ఒక్కొక్క నిందితుడి వద్ద ఏడు ప్యాకెట్ల చొప్పున మొత్తం 14 ప్యాకెట్ల హషీష్ ఆయిల్ లభించిందని, వాటి మొత్తం బరువు సుమారు 14.2 కిలోలు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. అరెస్టైన నిందితులను ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన తల్లె నాగరాజు (30), నాగుల నారాయణ అలియాస్ కిరణ్ (39)గా గుర్తించినట్లు బి. సుమతి తెలిపారు. తల్లె నాగరాజు హషీష్ ఆయిల్ పెడ్లర్ కమ్ ట్రాన్స్‌పోర్టర్‌గా, నాగుల నారాయణ కూడా పెడ్లర్ కమ్ ట్రాన్స్‌పోర్టర్‌గా వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.గతంలోనూ డ్రగ్స్ కేసులు నిందితులిద్దరికీ గతంలో గంజాయి అక్రమ రవాణా కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తల్లె నాగరాజుపై గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో 2023లో 10 కిలోల గంజాయికి సంబంధించిన కేసు నమోదైందని తెలిపారు. అలాగే నాగుల నారాయణ అలియాస్ కిరణ్పై ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో 2023లో 140 కిలోల గంజాయికి సంబంధించిన కేసు నమోదైనట్లు వెల్లడించారు. విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు కమిషనర్ బి. సుమతి తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా సింగవరం గ్రామానికి చెందిన తమర గోపాల్ అనే వ్యక్తి నిందితులను సంప్రదించి, ఒడిశా సరిహద్దు నుంచి హైదరాబాద్‌కు హషీష్ ఆయిల్ తరలించే బాధ్యత అప్పగించినట్లు వెల్లడించారు. ఒక్కొక్క నిందితుడికి సుమారు 7 కిలోల చొప్పున హషీష్ ఆయిల్ ఉన్న బ్యాగులను గోపాల్ అప్పగించినట్లు విచారణలో తేలిందన్నారు. హషీష్ ఆయిల్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి అప్పగిస్తే ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున చెల్లిస్తానని గోపాల్ చెప్పినట్లు తెలిపారు. రెండు బ్యాగుల్లో హషీష్ ఆయిల్‌ను తీసుకున్న నిందితులు పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు గ్రా-




మీణ మార్గాల ద్వారా యమహా బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరినట్లు పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్ చేరుకున్న తర్వాత డెలివరీ ప్రదేశం, తదుపరి




సూచనలు ఇస్తానని తమర గోపాల్ చెప్పినట్లు నిందితులు విచారణలో వెల్లడించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ డ్రగ్ రాకెట్‌లో ప్రధాన సరఫరాదారుగా పేర్కొంటున్న తమర గోపాల్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని బి. సుమతి తెలిపారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. హషీష్ ఆయిల్‌తో పాటు గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాల రవాణా, సరఫరాలో నిందితులకు ఉన్న సంబంధాలపై కూడా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో హషీష్ ఆయిల్‌ను ఎవరికి అప్పగించాల్సి ఉంది, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారు అనే అంశాలపై విచారణ కొనసాగుతోందన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు: హషీష్ ఆయిల్ – 14.2 కిలోలు,విలువ – సుమారు రూ.1.75 కోట్లు, మొబైల్ ఫోన్లు – 2, యమహా యంటి -15 మోటార్‌సైకిల్ – 1, నగదు – రూ.2,500 మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని కమిషనర్ బి. సుమతి తెలిపారు. డ్రగ్స్ సరఫరా వ్యవస్థను అడ్డుకోవడంతో పాటు విక్రేతలు, సరఫరాదారులు, వినియోగదారులను గుర్తించేందుకు పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని బి. సుమతి ప్రజలను కోరారు. సమాజ భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రగ్స్‌పై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. ఎల్బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ, ఐపీఎస్, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ అదనపు డీసీపీ ఎం.డి. షాకీర్ హుస్సేన్, ఎల్బీనగర్ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఏసీపీ పి. కాశీ రెడ్డి, నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డి, ఎస్ఓటీ బృందం, నాగోల్ పోలీసు సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. నాగోల్ పోలీస్ స్టేషన్‌లో సిఆర్.నం.529/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సెక్షన్ 8(సి) రెడ్‌విత్ 20(బి)(ఐఐ)(సి), 29 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

# భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం




ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహకాలు అందించే వ్యవస్థను అమలు చేస్తున్నామని వివరించారు. లైసెన్స్ రాజ్ కాలంలోని పరిమితుల నుంచి బయటపడి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే దిశగా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని మోదీ చెప్పారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ వ్యవస్థలు, రక్షణ ఉత్పత్తి వంటి రంగాల్లో సాధించిన పురోగతి దేశ ఆర్థిక శక్తిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు దేశీయ తయారీ రంగానికి కొత్త ఊపునిచ్చాయని వివరించారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, విధానాల కొనసాగింపే పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్న ప్రధాన అంశాలని ప్రధాని పేర్కొన్నారు. స్థిరమైన ప్రభుత్వం, స్పష్టమైన విధానాలతో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోందని చెప్పారు. సురక్షితమైన, స్థిరమైన భారత్ ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సవాళ్ల మధ్య కూడా భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగిస్తోందని ప్రధాని తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక వినియోగం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యాన్ని సాధిస్తున్నామని చెప్పారు. దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా సంస్కరణల వేగం మరింత పెరుగుతుందని స్పష్టం చేశారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం ప్రపంచ వ్యాప్తంగా విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు పాల్గొనే ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందింది. ఈ వేదికపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు భారత్ ఆర్థిక భవిష్యత్తు, పెట్టుబడుల అవకాశాలు, సంస్కరణల దిశపై అంతర్జాతీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి.

(మొదటి పేజీ తరువాయి..)

# నీట్ విద్యార్థిని హత్యతో దేశవ్యాప్తంగా సంచలనం

నా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. ఈ హత్య ముందస్తు ప్రణాళికతో జరిగి ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టుమార్టం నివేదిక ప్రకారం యువతి గొంతు కోయడం వల్ల మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తలపై తీవ్ర గాయాలు ఉన్నట్లు గుర్తించారు. కాళ్లు కట్టివేసిన స్థితిలో మృతదేహం లభించడం కేసు తీవ్రతను పెంచింది. యువతిపై లైంగిక దాడి జరిగిందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై స్పష్టత కోసం ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గదిలో లభించిన రక్తపు మరకలు, ఇతర ఆధారాలను శాస్త్రీయ పరీక్షలకు పంపించారు.

కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం వివేక్ చౌబే కొంతకాలంగా యువతిని వేధిస్తున్నాడు. ఆమె మరొక వ్యక్తిని వివాహం చేసుకుంటే మార్ఫింగ్ చేసిన చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తానని బెదిరించినట్లు వారు ఆరోపించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 22న యువతికి మరో యువకుడితో వివాహం నిశ్చయమైన తర్వాత వివేక్ వైఖరిలో మార్పు వచ్చిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ వివాహాన్ని అడ్డుకునే ఉద్దేశంతోనే హత్యకు పాల్పడి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నీట్ పరీక్షకు సంబంధించిన సహాయం చేస్తానని నమ్మించి యువతిని తన గదికి పిలిపించి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటన అనంత-



రం ప్రధాన నిందితుడు వివేక్ చౌబే పరారీలో ఉన్నాడు. అతడి కోసం నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. వారణాసితో పాటు పరిసర జిల్లాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు పది మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు అధికారులు తెలిపారు.

నిందితుడి మొబైల్ కాల్ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, సామాజిక మాధ్యమాల కార్యకలాపాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అతడు రాష్ట్రం దాటి వెళ్లి ఉండవచ్చనే అనుమానంతో ఇతర రాష్ట్రాల పోలీసులకు కూడా సమాచారం అందించారు.

ఈ కేసులో ఇంటి ప్రధాన ద్వారం వద్ద ఉన్న సీసీటీవీ కెమెరా ఘటన సమయంలో పనిచేయకపోవడం మరో కీలక అంశంగా మారింది. కెమెరా యాదృచ్ఛికంగా పనిచేయలేదా? లేక ముందస్తు ప్రణాళికలో భాగంగా నిలిపివేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యువతి మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు.

కేసులోని ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పటిష్టమైన ఆధారాలు సేకరిస్తామని పోలీసులు తెలిపారు. ఈ ఘటన మహిళల భద్రత, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు, ఆన్‌లైన్ బెదిరింపు-

# గోర్ఖా సమస్యల పరిష్కారానికి కేంద్రం కృషి

### సిలిగురిలో అమిత్ షా కీలక సమావేశం..
### రాజ్యాంగ పరిధిలో ఆకాంక్షల సాధనకు హామీ

సిలిగురి, ఆగస్టు 22 (వార్త సంధ్య): గోర్ఖా ప్రజల దీర్ఘకాలిక సమస్యలు, వారి ఆకాంక్షలు, ప్రాంతీయ అభివృద్ధి అంశాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక సమావేశం నిర్వహించారు. శనివారం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలో జరిగిన ఈ సమావేశంలో గోర్ఖా ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి పాల్గొన్నట్లు సమాచారం.

సమావేశంలో గోర్ఖా ప్రజల దీర్ఘకాలిక సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్లు, ప్రత్యేక గుర్తింపు, ప్రాంతీయ అభివృద్ధి, రాజకీయ పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. గోర్ఖా సమాజానికి సంబంధించిన పలు అంశాలను ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అమిత్ షా దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా గోర్ఖా ప్రజల భావోద్వేగాలు, అభ్యర్థనలు, భవిష్యత్ ఆకాంక్షలను గౌరవించే విధంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని అమిత్ షా స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గోర్ఖా ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.




గోర్ఖా ప్రజల న్యాయమైన ఆకాంక్షలను రాజ్యాంగ పరిధిలో నెరవేర్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తామని అమిత్ షా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గోర్ఖా సమాజం ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించడంతో పాటు గౌరవప్రదమైన, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పలు సూచనలు చేసినట్లు సమాచారం. ఆయా సూచనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన కార్యాచరణ రూపొందిస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. గోర్ఖా ప్రజల భవిష్యత్, అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాలతో సంప్రదింపులు కొనసాగిస్తామని తెలిపారు. గోర్ఖా సమాజం ఆశయాలను గౌరవిస్తూ, వారి సాంస్కృతిక గుర్తింపును కాపాడుతూ న్యాయబద్ధమైన, దీర్ఘకాలిక పరిష్కారాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అమిత్ షా వెల్లడించినట్లు సమాచారం.

# బ్రిక్స్ దేశాల 'చెన్నై ప్రకటన' ఆమోదం

### శాస్త్ర సాంకేతిక సహకారానికి కొత్త దిశ..

**చెన్నై, ఆగస్టు 22 (వార్త సంధ్య):** బ్రిక్స్ దేశాల మధ్య శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రూపొందించిన 'చెన్నై ప్రకటన'ను సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ విషయాన్ని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు.



భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన, స్థిరమైన, సన్నద్ధమైన శాస్త్ర, సాంకేతిక వ్యవస్థ నిర్మాణానికి 'చెన్నై ప్రకటన' మార్గదర్శకంగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ తెలిపారు. బ్రిక్స్ దేశాల శాస్త్ర, సాంకేతిక సహకారంలో ప్రజాకేంద్రిత, మానవతా దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వడమే ప్రకటన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

సాంకేతిక అభివృద్ధి ఫలాలు నేరుగా ప్రజలకు చేరేలా చర్యలు చేపట్టాలని సభ్య దేశాలు అభిప్రాయపడ్డాయని మంత్రి తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సమూహంగా గుర్తింపు పొందిన గ్లోబల్ సౌత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిశోధన, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రకటనలో స్పష్టం చేసినట్లు తెలిపారు. సమాన అవకాశాలు, జ్ఞాన భాగస్వామ్యం, సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు ప్రోత్సాహం కల్పించడం, సభ్య దేశాల మధ్య సంయుక్త పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం 'చెన్నై ప్రకటన'లోని కీలక అంశాలుగా నిలిచాయని చెప్పారు.

కొత్త సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, పరిశోధన ఫలితాల పరస్పర వినియోగం ద్వారా సభ్య దేశాల అభివృద్ధికి తోడ్పడాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

## కీలక రంగాల్లో సహకారం

కృత్రిమ మేధస్సు (ఏఐ), జీవసాంకేతికత, ఆరోగ్య పరిశోధనలు, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ ఆవిష్కరణలు తదితర రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఈ ప్రకటన దోహదపడనుంది. సభ్య దేశాల మధ్య జ్ఞాన మార్పిడి, సాంకేతిక భాగస్వామ్యానికి ఇది కొత్త అవకాశాలను తెరుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

'చెన్నై ప్రకటన' ఆమోదంతో బ్రిక్స్ దేశాలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సమిష్టి అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు వేశాయని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మానవాళి సంక్షేమం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో బ్రిక్స్ దేశాల మధ్య శాస్త్ర, సాంకేతిక సహకారం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# వృద్ధులే లక్ష్యంగా కోట్ల మోసం

### అమెరికాలో భారత సంతతి యువకుడి

**న్యూయార్క్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** అమెరికాలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సుమారు 7.5 మిలియన్ డాలర్ల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత సంతతి యువకుడు జయ సునిల్‌భారతి గోస్వామి (21)ను కెనడా అధికారులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌కు చెందిన గోస్వామి అమెరికాలోని న్యూజెర్సీలో నివసిస్తూ వృద్ధులను మోసగించే అంతర్జాల, ఫోన్ ఆధారిత ముఠాలో 'మనీ మ్యూల్'గా వ్యవహరించినట్లు అమెరికా న్యాయ శాఖ వెల్లడించింది. ఈ మోసం ద్వారా తొమ్మిది మంది బాధితులు సుమారు 7.56 మిలియన్ డాలర్లు నష్టపోయినట్లు దర్యాప్తులో తేలింది. బాధితుల వయస్సు 59 నుంచి 87 ఏళ్ల మధ్య ఉన్నట్లు అధికారులు తెలిపారు.



దర్యాప్తు వివరాల ప్రకారం.. ముఠా సభ్యులు వృద్ధులను ఫోన్ లేదా ఆన్‌లైన్ ద్వారా సంప్రదించి, వారి బ్యాంకు ఖాతాలు, నగదు లేదా వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో పడిందని నమ్మించేవారు. అనంతరం తమ ఆస్తులను నగదు, బంగారం లేదా గిఫ్ట్ కార్డుల రూపంలోకి మార్చుకోవాలని సూచించేవారు. ఆ తర్వాత పోలీసు అధికారులు లేదా ఇతర ప్రభుత్వ ప్రతినిధులుగా నటిస్తూ బాధితులను మరింత భయపెట్టి డబ్బు, బంగారాన్ని తమకు అప్పగించేలా చేసేవారని అధికారులు తెలిపారు.

నగదు, బంగారం సేకరించే బాధ్యతలో గోస్వామి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. న్యూయార్క్, న్యూజెర్సీ ప్రాంతాల్లో కనీసం తొమ్మిది సందర్భాల్లో వృద్ధుల నుంచి నగదు, బంగారం సేకరించినట్లు దర్యాప్తులో గుర్తించారు. గోస్వామి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా తెరిచి 2025 ఆగస్టు 1 నుంచి 2026 ఏప్రిల్ 6 మధ్య 90 వేల డాలర్లకు పైగా నగదును జమ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నగదు అతడు 'మనీ మ్యూల్'గా పనిచేసినందుకు అందుకున్న చెల్లింపులకు సంబంధించినదై ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

ఈ కేసులో గోస్వామిపై వైర్ ఫ్రాడ్, వైర్ ఫ్రాడ్‌కు కుట్ర, మనీలాండరింగ్, మనీలాండరింగ్‌కు కుట్ర వంటి అభియోగాలు నమోదయ్యాయి. ఆగస్టు 17న అమెరికా మెజిస్ట్రేట్ న్యాయమూర్తి మార్క్ డబ్ల్యూ. పీడర్సెన్ ఎదుట హాజరైన గోస్వామికి కొన్ని షరతులతో బెయిల్ లభించింది. అయితే మరుసటి రోజే అతడు అమెరికా నుంచి పీస్ బ్రిడ్జ్ మీదుగా కెనడాలోకి ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు.

తర్వాత టొరంటో నుంచి ఖతార్ రాజధాని దోహాకు వెళ్లేందుకు విమాన టికెట్ బుక్ చేసుకున్నట్లు అమెరికా అధికారులు తెలుసుకున్నారు. దీంతో కెనడా అధికారులు టొరంటో పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అమెరికా అభ్యర్థన మేరకు ఆగస్టు 20న అతడిని అప్పగింత ప్రక్రియ కోసం అరెస్ట్ చేశారు. గోస్వామిని తిరిగి అమెరికాకు రప్పించేందుకు అమెరికా న్యాయ శాఖ అంతర్జాతీయ వ్యవహారాల విభాగం కెనడా అధికారులతో కలిసి చర్యలు చేపడుతోంది.

గోస్వామిపై నమోదైన అభియోగాలు రుజువైతే గరిష్ఠంగా 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని అమెరికా అధికారులు తెలిపారు. అయితే ఇవి ప్రస్తుతం ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో నేరం రుజువయ్యే వరకు నిందితుడిని నిర్దోషిగానే పరిగణించాల్సి ఉంటుందని అమెరికా న్యాయ శాఖ స్పష్టం చేసింది.

ఈ కేసుపై అమెరికా అంతర్గత ఆదాయ శాఖ నేర పరిశోధన విభాగం (ఐ ఆర్ ఎస్ -సి ఐ ) దర్యాప్తు చేపట్టింది. న్యూయార్క్ స్టేట్ పోలీస్, న్యూజెర్సీ స్టేట్ పోలీస్, హోంల్యాండ్ సెక్యూరిటీ ఇన్వెస్టిగేషన్స్‌తో పాటు అమెరికా మార్షల్స్ సర్వీస్, యూఎస్ బోర్డర్ పెట్రోల్, కెనడా చట్ట అమలు సంస్థలు దర్యాప్తు, అరెస్ట్ చర్యల్లో సహకరించాయి. వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న అంతర్జాతీయ మోసాల వెనుక ఉన్న ఇతర వ్యక్తులు, నిధుల బదిలీ మార్గాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

# వాయుసేన స్థావరాల సంసిద్ధతపై సమీక్ష



**నాగ్‌పూర్, ఆగస్టు 21 (వార్త సంధ్య):** భారత వాయుసేన సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ ఎయిర్ మార్షల్ తరుణ్ చౌదరి, అఫ్వా (ప్రాంతీయ) అధ్యక్షురాలు సవితా చౌదరితో కలిసి సొనేగావ్, రాయ్‌పూర్ వాయుసేన స్థావరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఆపరేషనల్ సంసిద్ధత, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు.

సొనేగావ్ స్థావరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఎయిర్ మార్షల్, స్థావర సామర్థ్యాలను పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. మిహాన్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ వాయుసేన కేంద్రం 'ప్రాజెక్ట్ గజరాజ్' పురోగతిని కూడా పరిశీలించారు.

వాయుసేన సిబ్బందితో సమావేశమైన తరుణ్ చౌదరి, దేశ రక్షణలో వారి అంకితభావాన్ని అభినందించారు. వనరుల సమర్థ వినియోగం, సిబ్బంది భద్రత, దళాల సామర్థ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు.

రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ప్రధాన కార్యదర్శి వికాస్ శీల్‌తో భేటీ అయి పౌర, సైనిక వ్యవస్థల మధ్య సమన్వయంపై చర్చించారు. సవితా చౌదరి సొనేగావ్‌లో సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించి, వాయుసేన కుటుంబాల సంక్షేమానికి సంగినీలు చేస్తున్న సేవలను ప్రశంసించారు.

# ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్




**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని, అలాంటి ఉద్యోగులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగులు ఆ పార్టీ హామీలను నమ్మి పనిచేశారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించడం అన్యాయమని విమర్శించారు. గత మూడు నెలలుగా ఉద్యోగుల జీతాల నుంచి 1.5 శాతం కోత విధిస్తున్నారని, దీనిపై ప్రభుత్వం బహిరంగంగా వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల నుంచి ఈహెచ్ఎస్ కోసం డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ, ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ సేవలు అందక ఉద్యోగులను బయటకు పంపిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు స్మార్ట్ హెల్త్ కార్డులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఖాజా మొహియుద్దీన్ అనే రిటైర్డ్ టీచర్‌కు ఈహెచ్ఎస్ వర్తించకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.8 లక్షలు వైద్య ఖర్చులు చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

### పీఆర్సీ, డీఏలు అత్యధికంగా పెండింగ్

రాష్ట్రంలో పీఆర్సీ, డీఏలు అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగులు, పెన్షన్‌దారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్‌దారులకు సుమారు రూ.15 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తాలపై జాప్యం చేస్తూ, పెన్షన్‌దారులు ఒక్కరోజు ఆలస్యంగా చెల్లించినా వడ్డీ వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

### అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించిన నిధుల విషయంలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయని, సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను బయటపెట్టాలని కోరారు. ఒక మంత్రి ఈ వ్యవహారంలో పాలుపంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ, వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

### సీపీఎస్ రద్దు హామీ ఏమైంది?

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు అవుతున్నా సీపీఎస్‌ను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు చేసే వరకు ఉద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సీపీఎస్ ఉద్యోగులు సభ నిర్వహించుకోవడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. "సీపీఎస్ ఉద్యోగులు ఏమైనా దేశద్రోహులా? వారి సభకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు?'' అని ప్రశ్నించారు. శాంతిభద్రతలు కాపాడే సుమారు 70 వేల మంది పోలీసు కానిస్టేబుళ్లు కూడా సీపీఎస్ పరిధిలో ఉన్నారని గుర్తుచేశారు.

### కాళేశ్వరంపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది

కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా శ్రీనివాస్ గౌడ్ స్పందించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదికను ప్రస్తావిస్తూ, బ్యారేజీల నాణ్యతపై ప్రభుత్వం ఇంతకాలం చేస్తున్న ప్రచారంపై ఆ నివేదిక పునరాలోచనకు దారితీస్తుందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో పోస్టుల విషయంలోనూ అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు.

మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 180 ఉద్యోగాలను ప్రభుత్వం అమ్ముకుందని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

### ఉద్యోగుల నిరసనకు బీఆర్ఎస్ మద్దతు

ఉద్యోగులు నిర్వహించనున్న నిరసన సభకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉద్యోగులతో భుజం భుజం కలిపి పోరాడుతామని స్పష్టం చేశారు. ఏ వర్గానికి అన్యాయం జరిగినా బీఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు.

ఈ సందర్భంగా కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి. దేవీప్రసాద్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

## 22ఏ నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరిచ్చారు?: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి..)

హిబిషన్ జాబితాలో ఉన్నాయని తెలియడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు.

చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆరోపిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ఏ భయం చూపిస్తూ బినామీలతో సెటిల్మెంట్లకు తెరలేపుతున్నారనే బాధితుల ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



"దీనికి మీ సమాధానం ఏమిటి రేవంత్‌రెడ్డి?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 22ఏ నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఆయా కాలనీలను తక్షణమే 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బాధితుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

# పవర్‌ఫుల్ తెలంగాణ కోసం పకడ్బందీ ప్రణాళికలు



**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రాన్ని పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నామని, పరిశ్రమలకు విద్యుత్, నీటి కొరత లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు.

హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పవర్ ఎగ్జిబిషన్–2026ను భట్టి విక్రమార్క ప్రారంభించారు. విద్యుత్ శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలకు అందుతున్న సేవలను విద్యార్థులు, ప్రజలకు వివరించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గతంలో సుమారు 13 వేల మెగావాట్లు ఉండగా ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు పైగా పెరిగిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ ముందస్తు ప్రణాళికలు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ బలోపేతం, అవసరమైన విద్యుత్‌ను సకాలంలో సమీకరించడం వల్ల నిరంతర సరఫరా అందిస్తున్నామని పేర్కొన్నారు.

వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు 1912 టోల్‌ఫ్రీ సేవలు, 'పవర్ అంబులెన్స్'ను మరింత సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సమస్యను గుర్తించి పరిష్కరించే విధానాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని థర్మల్‌తో పాటు సోలార్, హైడల్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ వంటి రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని భట్టి తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు నాలుగైదేళ్ల సమయం పడుతున్నందున ముందస్తు ప్రణాళికలు తప్పనిసరి అన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పెండింగ్ ప్రమోషన్లు కల్పించడంతో పాటు ప్రమాదకర విధుల్లో పనిచేసే ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా అందిస్తున్నామని తెలిపారు.

# పేదలపై ప్రభుత్వ ప్రతాపమా?

## హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఉన్న పేదల దుకాణాలు కూల్చేశారు

### తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రూప్ సింగ్



**హైదరాబాద్, ఆగస్టు 22 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** దుర్గం చెరువు వద్ద పేదల జీవనాధారమైన దుకాణాలను తొలగించడం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రూప్‌సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి దుర్గం చెరువు వద్ద సర్వే నంబర్ 83లో కూల్చివేసిన దుకాణాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా రూప్‌సింగ్ మాట్లాడుతూ.. ఈ భూమిలో ఎన్నో ఏళ్లుగా పేదలు చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తమ జీవనాధారమైన దుకాణాలను తొలగించవద్దంటూ బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారులు రాత్రికి రాత్రే దుకాణాలను తొలగించి పేదల ఉపాధిని దెబ్బతీశారని ఆరోపించారు.

హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టడం కోర్టు ఆదేశాల పట్ల అధికారుల వైఖరిని ప్రశ్నించేలా ఉందని రూప్‌సింగ్ అన్నారు. పేదల దుకాణాలను తొలగించిన స్థలాన్ని ఒక పెద్ద కంపెనీకి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

"ప్రజాపాలన తెస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలపై ప్రతాపం చూపించడం సరికాదు. పేదల జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని రూప్‌సింగ్ అన్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని, కూల్చివేతలతో నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

వార్త సంధ్య

## కారేపల్లి పెట్రోల్ బంకులో

# కరెంట్ కష్టాలు..

### బారులు తీరిన వాహనదారులు




**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 22 (వార్త సంధ్య):** కారేపల్లిలో వీధి స్తంభాల ఏర్పాటు పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కారేపల్లి పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చిన వాహనదారులు బారులు తీరారు.

పెట్రోల్ బంకులో జనరేటర్ అందుబాటులో లేకపోవడంతో విద్యుత్‌పై ఆధారపడే పంపులు పనిచేయక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో సాధారణ పెట్రోల్‌కు బదులుగా అధిక ధర కలిగిన పవర్ పెట్రోల్ మాత్రమే అందుబాటులో ఉంచడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా విద్యుత్ సమస్యతో పాటు జనరేటర్ అందుబాటులో లేకపోవడంతో మరోసారి ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.

ఈ విషయమై బంక్ సిబ్బందిని వివరణ కోరగా, జనరేటర్‌లోసాంకేతికసమస్యతలెత్తడంతోరిపేర్ కోసం పంపించామని, గత మూడు రోజులుగా జనరేటర్ అందుబాటులో లేదని తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిచిపోయే సందర్భాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## జానపదమే జనం గుండె చప్పుడు..

## ఉద్యమ గాయకుడు నాగేంద్రబాబుకు ఘన సన్మానం

### ప్రపంచ జానపద దినోత్సవం సందర్భగా కారేపల్లిలో ఘనంగా వేడుకలు



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 22 (వార్త సంధ్య )**కారేపల్లి: జానపదం అంటే కేవలం పాట కాదు.. అది పల్లె ప్రజల జీవనగానం.. కష్టాలను, కన్నీళ్లను, పోరాటాలను, ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పే శక్తివంతమైన ఆయుధం. అలాంటి జానపద కళకు మరింత ప్రాధాన్యత కల్పించాలనే సంకల్పంతో ప్రపంచ జానపద దినోత్సవాన్ని కారేపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.

ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఉద్యమ గాయకుడు పాటమ్మ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పల్లె సంస్కృతికి, జానపద కళలకు, ప్రజా గేయాలకు జీవం పోస్తున్న కళాకారులను సమాజం గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లే గాయకుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఉద్యమ గాయకుడు పాటమ్మ నాగేంద్రబాబును శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. జానపద, ఉద్యమ గేయాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు కళారంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నాగేంద్రబాబు తన గానంతో పల్లె ప్రజల గొంతుకగా నిలుస్తూ, జానపద కళకు మరింత గుర్తింపు తీసుకురావాలని పలువురు అభిలషించారు.

ఈ సందర్భంగా ఇరానీ చాయ్ హోటల్ యజమాని నరేష్, ఆదెర్ల రాములు, మీడియా మిత్రుడు రాయల శ్రీనివాస్, ప్రముఖ గాయకుడు ఆదెర్ల శంకర్, యువ నాయకుడు కిషోర్, 'నిజం చెపుతా' రిపోర్టర్ బన్షిలాల్, 'పయనించే సూర్యుడు' రిపోర్టర్ నరేష్, దుబ్బ తండా సర్పంచ్ మాత్రు నాయక్ తదితరులు పాల్గొని నాగేంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

జానపద కళలను కాపాడుకోవడం అంటే మన పల్లె సంస్కృతిని, మన మూలాలను కాపాడుకోవడమేనని పలువురు పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో జానపద కళలు, పల్లె పాటలు, ప్రజా గేయాలకు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు.

కారేపల్లి వేదికగా జరిగిన ఈ కార్యక్రమం జానపద కళాకారులకు ఉత్సాహాన్ని నింపింది. కళాకారుల గౌరవం కోసం, జానపద సంస్కృతి పరిరక్షణ కోసం అందరూ కలసి ముందుకు సాగాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు.

## కొత్తపేటలో అమరావతి వైన్స్ సర్కిల్ వద్ద

# ట్రాఫిక్ కష్టాలు

### నిరంతర రద్దీతో వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు.. తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** కొత్తపేటలోని అమరావతి వైన్స్ ఎదురుగా ఉన్న సర్కిల్ వద్ద నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ వాహనదారులు, స్థానికులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ఈ కూడలిలో వాహనాల రాకపోకలు మారింది. పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో కొందరు వాహనదారులు రహదారి అంచుల్లోనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ఇప్పటికే పరిమితంగా ఉన్న రహదారి స్థలం మరింత తగ్గిపోతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్డు పక్కన వరుసగా నిలిపివేయడం వల్ల ఇతర వాహనాలు




భారీగా పెరగడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. ఫలితంగా కొద్దిదూరం ప్రయాణించేందుకు కూడా వాహనదారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కొత్తపేట ప్రధాన ప్రాంతాల్లో ఒకటిగా ఉండటంతో ఈ మార్గంలో రోజంతా వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. చుట్టుపక్కల పెరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలు, నివాస ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, ప్రధాన రహదారిపై కలిసే ఇతర మార్గాల కారణంగా రద్దీ మరింత పెరుగుతోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. రద్దీ సమయాల్లో వాహనాలు ఒకదానికొకటి అడ్డంగా నిలిచిపోవడంతో కూడలి వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కష్టంగా మారుతోంది.

### స్థానికుల ప్రకారం..

రోడ్డు పక్కన వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడం కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా వెళ్లేందుకు ఇబ్బంది ఏర్పడుతోంది.

అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలు, అనధికారిక వ్యాపార కార్యకలాపాలు కూడా వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట సిగ్నల్స్, సూచిక బోర్డులు, లేన్ మార్కింగ్స్ లేకపోవడం వల్ల వాహనదారులు తమకు అనుకూలంగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని, దీంతో గందరగోళం ఏర్పడుతోందని చెబుతున్నారు. ఈ ట్రాఫిక్ రద్దీ కారణంగా సాధారణ ప్రయాణికులతో పాటు అత్యవసర సేవల వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు వంటి అత్యవసర వాహనాలు రద్దీ మధ్య చిక్కుకుంటే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పాదచారులు రహదారి



దాటే సమయంలో కూడా వాహనాల రద్దీ కారణంగా భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీతో పాటు సంబంధిత పౌర శాఖలు సంయుక్తంగా ఈ ప్రాంతంలో సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే సమయాలను గుర్తించి ఆ సమయంలో అదనపు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. రోడ్డు పక్కన అక్రమ పార్కింగ్‌ను కఠినంగా నియంత్రించడంతో పాటు అవసరమైన చోట పార్కింగ్ నిషేధ ప్రాంతాలను గుర్తించాలని కోరుతున్నారు. అలాగే రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించడం, లేన్ క్రమశిక్షణను అమలు చేయడం, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేయడం, అవసరమైన



చోట సిగ్నల్స్‌ను మెరుగుపరచడం వంటి చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కూడలి వద్ద ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కూడా కోరుతున్నారు.

కొత్తపేటలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

## అప్పాయిగూడెం గ్రామ పంచాయతీలో పారిశుధ్య, డ్రైనేజ్ మరియు నూతన పైప్‌లైన్ పనులు

**సింగరేణి ప్రతినిధి ఆగస్టు 22 (వార్త సంధ్య ) :** సింగరేణి మండలం అప్పాయిగూడెం: గ్రామ పంచాయతీ పరిధిలో



ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను ట్రాక్టర్ సహాయంతో తొలగించి, పరిసరాలను శుభ్రపరిచారు. అలాగే దోమలు, ఈగలు మరియు వ్యాధికారక క్రిముల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. అదేవిధంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టారు. జేసీబీ యంత్రం సహాయంతో డ్రైనేజ్ కోసం తవ్వకాలు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ పనుల ద్వారా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యను తగ్గించడంతో పాటు, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి మరియు ప్రజల సౌకర్యం కోసం అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, రోడ్లపై చెత్త వేయకుండా గ్రామ పంచాయతీకి సహకరించాలని సర్పంచ్ కోరారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ దండు ప్రవీణ్ , కార్యదర్శి కృష్ణవేణి , గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌కు డీజీపీ సీవీ ఆనంద్ అభినందనలు

## ప్రజా భద్రతలో పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం కీలకం

**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** ప్రజలకు మరింత చేరువ కావాలంటే పోలీసు వ్యవస్థతో పాటు ప్రజలు, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఈ ఆలోచనతో 2006 ఆగస్టు 23న ఏర్పాటు చేసిన సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రజా భద్రతలో కీలక భాగస్వామిగా ఎదగడం అభినందనీయమని పేర్కొన్నారు.



పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌తో సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అనేక వినూత్న కార్యక్రమాలను చేపట్టిందని సీవీ ఆనంద్ తెలిపారు. మహిళల భద్రత కోసం 'షీ షటిల్స్', విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధి కోసం 'చైతన్య' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చేరువైనట్లు చెప్పారు.

తాను సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో సెక్యూరిటీ కౌన్సిల్ కొంతవరకు నిర్వీర్యమైన పరిస్థితుల్లో ఉందని సీవీ ఆనంద్ గుర్తుచేశారు. దానికి తిరిగి జీవం పోసి ప్రజా భద్రతలో మరింత సమర్థవంతమైన భాగస్వామిగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పబ్లిక్, ప్రైవేట్ రంగాలకు చెందిన ప్రతినిధులతో విస్తృతంగా చర్చించి పలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.

ప్రజల భద్రత, సంక్షేమం కోసం పోలీసులతో కలిసి నిరంతరం పనిచేసేలా సెక్యూరిటీ కౌన్సిల్‌ను బలోపేతం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం సైబరాబాద్‌లో సెక్యూరిటీ కౌన్సిల్ సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజా భద్రతలో పోలీసుల పాత్రను మరింత విస్తరించడంలో కీలక భాగస్వామిగా నిలవడం సంతోషకరమన్నారు.

సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కౌన్సిల్ సభ్యులు, భాగస్వామ్య సంస్థలు, గతంలో కౌన్సిల్‌తో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సీవీ ఆనంద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ, మరిన్ని వినూత్న కార్యక్రమాలతో ప్రజా భద్రతకు సేవలందించాలని ఆకాంక్షించారు.

# రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి సేవలు పోలీసులకు స్ఫూర్తిదాయకం

## తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా 157వ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలను రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో అకాడమీ అధికారులు, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలోని రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విగ్రహానికి అకాడమీ అధికారులు, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి పేరు తెలంగాణ పోలీస్ అకాడమీతో పాటు మొత్తం పోలీస్ వ్యవస్థకు నిరంతర స్ఫూర్తినిస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, పోలీస్ సేవలకు ఆయన నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థుల సంక్షేమం కోసం ఆయన ఏర్పాటు చేసిన నిధి ద్వారా శిక్షణార్థుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, దూరదృష్టి స్పష్టమవుతుందని తెలిపారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఆయన పేరుతో తెలంగాణ పోలీస్ అకాడమీని మరింత అభివృద్ధి చేసుకోవడం గర్వకారణమన్నారు.

ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ వెంకట రామిరెడ్డి విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్య ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యంతో అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఎంతోమందికి విద్యావకాశాలు కల్పించారని కొనియాడారు. సమాజ సేవ, విద్యాభివృద్ధి, ప్రజాసేవలో ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు.

రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి బాల్యం, పోలీస్ శాఖలోకి వచ్చిన విధానం, నిజాం కాలంలో హైదరాబాద్ కొత్వాల్‌గా నిర్వహించిన బాధ్యతలను వివరించారు. ప్రజలతో ఆయన వ్యవహరించిన తీరు, పోలీసింగ్‌లో అనుసరించిన ప్రత్యేక విధానాలు నేటి పోలీస్ అధికారులకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజల భద్రత, సంక్షేమం, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఆయన అందించిన సేవలను నేటి అధికారులు, శిక్షణార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమం అనంతరం ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డిలకు తెలంగాణ పోలీస్ అకాడమీ తరఫున జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, నరహరి, డీఎస్పీలు ఆదూరి శ్రీనివాసరావు, కృష్ణ, తోట శ్రీనివాసులు, తిరుపతి, జగదీశ్వర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అకాడమీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు ఇచ్చిన హామీలను

## కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

### ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు

### ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్ ఆగస్టు 22 (వార్త సంధ్య):** హయత్‌నగర్ కోర్టు పరిధిలో న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి కోర్టు ప్రాంగణంలో మౌలిక వసతులను మెరుగుపరచాలని హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్.బి.నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కోరారు.

ఈ మేరకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హయత్‌నగర్ కోర్టు ప్రాంగణాన్ని సందర్శించి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులతో కలిసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కోర్టులో సుమారు 200 మంది న్యాయవాదులు విధులు నిర్వహిస్తున్నారని, ప్రతిరోజూ కోర్టుకు వచ్చే కక్షిదారులు, ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



కోర్టు ప్రాంగణంలో పార్కింగ్, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, సంబంధిత సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, భాస్కర్ సాగర్, బోడ బిక్షపతి, హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె లింగంగౌడ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# తెలంగాణ పెట్టుబడులకు ప్రపంచ స్థాయి వేదిక

## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్–2026'లో మంత్రి ముఖ్యోపన్యాసం చేశారు. తెలంగాణకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ పారిశ్రామిక, వ్యాపార, సాంకేతిక సంస్థలను ఆయన ఆహ్వానించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, యువశక్తి, పెట్టుబడిదారులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం తెలంగాణకు ప్రధాన బలాలని పేర్కొన్నారు.

2025–26లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని, జాతీయ స్థాయిలో 8 శాతం నామమాత్రపు వృద్ధి నమోదవుతుండగా తెలంగాణ 10.7 శాతం వృద్ధిని సాధిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్–2047' రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తోందన్నారు.

అభివృద్ధిని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించేందుకు సీయూఆర్‌ఈ, పీయూఆర్‌ఈ, ఆర్ఏఆర్‌ఈ అనే మూడు ఆర్థిక ప్రాంతాల వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి నగరాల్లో పరిశ్రమలు, లాజిస్టిక్స్, ఆహార శుద్ధి రంగాలకు విస్తృత అవకాశాలున్నాయని వివరించారు.

సాంకేతిక రంగంతో పాటు సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ, విద్యుత్ వాహనాలు, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సాగునీటి రంగంలో కృత్రిమ మేధ, డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలు, సెన్సర్ల వినియోగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

వ్యవసాయ ఉత్పత్తులను ముడిసరుకుగా కాకుండా రాష్ట్రంలోనే శుద్ధి చేసి, విలువ జోడించి ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసేలా ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్లు, గిడ్డంగులు, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తామని వెల్లడించారు.

"తెలంగాణకు రండి.. ఇక్కడ పెట్టుబడులు పెట్టండి.. ఇక్కడే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను తెలంగాణ నుంచే అందిద్దాం" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

వార్త సంధ్య

# ఉగ్రవాద బాధితుల త్యాగాలు మరువరానివి

డెస్క్, ఆగస్టు 22 (వార్త సంధ్య): ఉగ్రవాదం అనే మాట వినగానే భయం, విషాదం, విధ్వంసం వంటి భావనలు మెదులుతాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక ఉగ్రదాడులు వేలాది కుటుంబాలను కన్నీటి సంద్రంలో ముంచాయి. అమాయక ప్రజలు, చిన్నారులు, మహిళలు, భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల హింసకు బలయ్యారు. వారి ప్రాణాలు క్షణాల్లో ముగిసినా, కుటుంబ సభ్యులు అనుభవించే వేదన మాత్రం జీవితాంతం కొనసాగుతుంది.

ప్రతి సంవత్సరం ఆగస్టు 21న నిర్వహించే అంతర్జాతీయ ఉగ్రవాద బాధితుల జ్ఞాపకార్థం, సంతాప దినం బాధితులను స్మరించుకోవడానికి, వారి త్యాగాలను గుర్తు చేసుకోవడానికి ఒక ముఖ్యమైన సందర్భం. ఉగ్రవాదం కేవలం ప్రాణనష్టానికే పరిమితం కాదు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోతే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోతుంది. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములను కోల్పోయిన కుటుంబాలు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తాయి. ఒక ఉగ్రదాడి ప్రభావం ఒక్క వ్యక్తిపైనే కాదు.. మొత్తం కుటుంబం, కొన్నిసార్లు ఒక సమాజంపైనే పడుతుంది.

ప్రపంచంలోని అనేక దేశాలు ఉగ్రవాదం కారణంగా తీవ్ర నష్టాలను చవిచూశాయి. పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రజా ప్రదేశాల్లో జరిగిన దాడులు ఎన్నో అమాయక ప్రాణాలను బలిగొన్నాయి. రోజువారీ జీవితంలో నిమగ్నమైన సాధారణ ప్రజలు ఒక్కసారిగా హింసకు గురయ్యారు. ప్రతి ఉగ్రదాడి వెనుక అనేక కుటుంబాల కన్నీటి గాథలు దాగి ఉంటాయి.

బాధితులను స్మరించుకోవడం అంటే ఒకరోజు నివాళులు అర్పించడం మాత్రమే కాదు. వారి కుటుంబాలకు ఆర్థిక, విద్యా, వైద్య, ఉపాధి, పునరావాస సహాయం అందించడం కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వాలు,



ఉగ్రవాద సంస్థల ప్రధాన లక్ష్యం ప్రజల్లో భయాన్ని సృష్టించడం, అసురక్షిత భావనను పెంచడం, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడం. అయితే ఉగ్రవాదం మానవత్వాన్ని ఓడించలేదని చరిత్ర నిరూపించింది. విషాద ఘటనల అనంతరం ప్రజలు మరింత ఐక్యంగా నిలబడి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. అదే మానవత్వానికి ఉన్న గొప్ప బలం.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం కేవలం భద్రతా బలగాల బాధ్యత మాత్రమే కాదు. సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత కూడా. ద్వేషపూరిత ప్రచారం, హింసాత్మక భావజాలం, యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాలి. కుటుంబం నుంచి విద్యాసంస్థల వరకు శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను బలపరచాలి. స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి.

భారతదేశం కూడా ఉగ్రవాదం వల్ల ఎన్నోసార్లు దెబ్బతింది. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన భద్రతా సిబ్బంది, అమాయక పౌరుల త్యాగాలు మన జ్ఞాపకాల్లో ఎప్పటికీ నిలిచిపోవాలి. వారి సేవలను, త్యాగాలను యువతకు తెలియజేయడం మన బాధ్యత.

సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేటి కాలంలో ఉగ్రవాదం కూడా కొత్త రూపాలను సంతరించుకుంటోంది. సామాజిక మాధ్యమాలు, అంతర్జాల వేదికల ద్వారా యువతను ప్రభావితం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాలి.

ఉగ్రవాద బాధితుల జ్ఞాపకార్థం నిర్వహించే ఈ దినం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది— ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించకూడదు. బాధితుల పట్ల మానవత్వంతో నిలబడాలి. మతం, జాతి, భాష, ప్రాంతం అనే భేదాలు లేకుండా ఉగ్రవాద బాధితులందరూ మనుషులే.

వారి త్యాగాలు చరిత్ర పుటల్లో మాత్రమే కాకుండా మన హృదయాల్లో సజీవంగా ఉండాలి. హింసకు బదులుగా శాంతిని, ద్వేషానికి బదులుగా ప్రేమను, విభజనకు బదులుగా ఐక్యతను ప్రోత్సహించడమే ఉగ్రవాదానికి నిజమైన సమాధానం. ఉగ్రవాద రహిత ప్రపంచ నిర్మాణమే బాధితులందరికీ మనం అర్పించే అత్యంత గొప్ప నివాళి.

# పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం ఉప ముఖ్యమంత్రి బట్టి

ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల అనంతరం అక్కడ కొందరు 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడాన్ని భట్టి ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి పట్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ఆలోచించాల్సిన అవసరాన్ని తెలియజేస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో సమాజం ఇంకా ఎంత దూరం ప్రయాణించాల్సి ఉందో ఇలాంటి ఘటనలు గుర్తు చేస్తున్నాయని అన్నారు.



## జాతీయోద్యమంలో పత్రికలది కీలక పాత్ర

భారతదేశ నిర్మాణంలో జర్నలిజం అంతర్భాగమని భట్టి విక్రమార్క అన్నారు. జర్నలిజం కేవలం వార్తలు రాయడం కాదని, పౌరులను చైతన్యవంతులను చేయడం, సమాజాన్ని తీర్చిదిద్దడం కూడా దాని బాధ్యత అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ 'యంగ్ ఇండియా', 'నవజీవన్', 'హరిజన్' వంటి పత్రికల ద్వారా ప్రజలను స్వాతంత్ర్యోద్యమం వైపు నడిపించారని గుర్తుచేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ 'మూక్ నాయక్', 'బహిష్కృత భారత్' వంటి పత్రికలను స్థాపించి అణగారిన వర్గాలకు గొంతుకగా నిలిచారని చెప్పారు. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 'కేసరి', 'మరాఠా' పత్రికల ద్వారా బ్రిటిష్ పాలనను సవాలు చేశారని తెలిపారు.

దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి ప్రముఖులు పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు సాధనాలుగా ఉపయోగించారని భట్టి అన్నారు. 'అమృత బజార్ పత్రిక', 'ది హిందూ' వంటి పత్రికలు ప్రజల గొంతుకగా నిలిచాయని గుర్తుచేశారు.

ప్రజాస్వామ్యంలో పాలకులు, పత్రికల మధ్య ఉండాల్సిన సంబంధాన్ని వివరిస్తూ 1948లో 'శంకర్స్ వీక్లీ'లో తనను నిరంతరం కార్టూన్ల ద్వారా విమర్శించిన శంకర్‌ను ఉద్దేశించి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన వ్యాఖ్యలను భట్టి గుర్తుచేశారు. ప్రభుత్వాలను ప్రశ్నించే స్వేచ్ఛను పత్రికలు కాపాడుకోవాలని సూచించారు.

## డిజిటల్ యుగంలో విశ్వసనీయతే ఆయుధం

సామాజిక మాధ్యమాలు భావప్రకటనా స్వేచ్ఛను విస్తరించినప్పటికీ స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదని భట్టి స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో తప్పుడు సమాచారం, పుకార్లు వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులకు విశ్వసనీయతే అత్యంత విలువైన ఆస్తి అని అన్నారు.

"ఈ కాలంలో సమాచార కొరత లేదు.. నమ్మకం కొరత ఉంది. అందరూ ప్రచురించగలిగే పరిస్థితుల్లో జర్నలిస్టు వద్ద అత్యంత విలువైన ఆస్తి ప్రింటింగ్ ప్రెస్ కాదు.. విశ్వసనీయత" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## జిల్లా జర్నలిస్టుల రక్షణకు ప్రాధాన్యం

కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ కేవలం మరో సంస్థగా మిగిలిపోకుండా జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాల పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని భట్టి ఆకాంక్షించారు. ముఖ్యంగా గ్రామీణ, జిల్లా, చిన్న పట్టణాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం, ఆసుపత్రుల్లో వైద్యులు లేకపోవడం, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కాకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వ దృష్టికి ముందుగా తీసుకువచ్చేది తరచుగా స్థానిక జర్నలిస్టులేనన్నారు. ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంటే మంచి జర్నలిస్టు ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పనిచేస్తారని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల స్వభావంలోనే స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేసే సంప్రదాయం ఉందని భట్టి అన్నారు. తెలంగాణ ఉద్యమాలు, సాహిత్యం, సంస్కృతిపై ఈ స్వేచ్ఛ ప్రభావం చూపిందని తెలిపారు. తమతో విభేదించే గొంతుకలను వినే ధైర్యం ప్రజా జీవితంలో ఉన్నవారికి ఉండాలని అన్నారు.

"అధికారంలో ఉన్నవారిని వదలకండి.. అదే సమయంలో మీ వృత్తి ప్రమాణాలను కూడా వదలకండి. మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి. మిమ్మల్ని మీరు మీ ప్రమాణాలకు జవాబుదారీగా ఉంచుకోండి. ఈ రెండింటి ప్రయోజనం చివరికి పౌరుడికే దక్కాలి" అని భట్టి విక్రమార్క అన్నారు.

ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

# జాతీయ ఉపాధ్యాయ పురస్కారానికి ఏపీ గురువు ఎంపిక

- విజయనగరం ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం
- కౌలూరి రాజేష్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు
- విద్యలో సాంకేతిక వినియోగానికి గుర్తింపు
- ఇతర ఇద్దరు ఉపాధ్యాయులకూ శుభాకాంక్షలు

**అమరావతి, ఆగస్టు 22 (వార్త సంధ్య ):** ఆంధ్రప్రదేశ్ విద్యారంగానికి గర్వకారణంగా విజయనగరం జిల్లా చిన్నమల్లుపేట ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు కౌలూరి రాజేష్ జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు–2026కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యా బోధనలో కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికత వినియోగం, విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యాస నైపుణ్యాల పెంపుదల కోసం ఆయన చేసిన కృషి దేశ స్థాయిలో గుర్తింపు పొందడం సంతోషకరమని పేర్కొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిగా చదివి, అదే వ్యవస్థలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ ఇప్పుడు జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక కావడం కౌలూరి రాజేష్ అంకితభావానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ అన్నారు. ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిని మార్చగలిగితే, తరతరాల భవిష్యత్తును కూడా మార్చగలడని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి కౌలూరి రాజేష్ విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యా రంగంలో కొత్త ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమన్నారు.
అలాగే తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా గాంధారి ప్రాంతానికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు బొంపెల్లి భవాని, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన జెల్లి ప్రకాశ్ రావు కూడా జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు–2026కు ఎంపిక కావడం అభినందనీయమని పవన్ కల్యాణ్ తెలిపారు. వారిద్దరికీ కూడా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ ముగ్గురు ఉపాధ్యాయులు దేశ విద్యారంగానికి విశిష్ట సేవలు అందించారని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థను బలోపేతం

# దోమల బెడదతో ప్రజల ఇబ్బందులు

– వర్షాలతో పెరుగుతున్న దోమల వ్యాప్తి
– డెంగీ, మలేరియా ప్రమాదంపై ఆందోళన

**డెస్క్, ఆగస్టు 20 (వార్త సంధ్య):** వర్షాకాలంలో దోమల సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలు, గ్రామాలు, పట్టణాల్లో నిల్వ నీరు ఎక్కువగా ఉండటం వల్ల దోమల ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో సాయంత్రం వేళల్లో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుండటంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. స్వీయ చికిత్సకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం ద్వారా దోమల పెరుగుదలను గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కూలర్లు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, నీటి ట్యాంకులు వంటి ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పురపాలక సంస్థలు, గ్రామపంచాయతీలు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నాయి. దోమల నివారణ కోసం పొగమంచు మందుల పిచికారీ, లార్వా నిర్మూలన చర్యలను ముమ్మరం చేస్తున్నాయి. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరుతున్నారు. దోమల కాట్ల నుంచి రక్షణ పొందేందుకు దోమతెరలు, దోమల నివారణ క్రీములు, పూర్తి చేతుల దుస్తులు ఉపయోగించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడటం, నిల్వ నీటిని తొలగించడం, ఆరోగ్య శాఖ సూచనలు పాటించడం ద్వారా దోమల బెడదను తగ్గించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుందని స్పష్టం చేస్తున్నారు.





# ఎల్‌ఎఫ్‌సీ–2 ఫైట్ నైట్‌లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

మార్షల్ ఆర్ట్స్, ఫైటింగ్ స్పోర్ట్స్‌కు మరింత ప్రోత్సాహం: మంత్రి

**హైదరాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన లెగసీ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్–2 ఫైట్ నైట్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన ఫైటర్ల మీట్ అండ్ గ్రీట్లో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, శాట్ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి మంత్రి పాల్గొని క్రీడాకారులను అభినందించారు.




అనంతరం జరిగిన తొలి బౌట్‌లో హైదరాబాద్‌కు చెందిన బాస సత్వీక్, ఇండోర్‌కు చెందిన అరుణ్ వర్మ తలపడ్డారు. బౌట్ అనంతరం విజేతను మంత్రి వాకిటి శ్రీహరి అభినందించి సన్మానించారు.


యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు మార్షల్ ఆర్ట్స్, ఫైటింగ్ స్పోర్ట్స్‌కు తెలంగాణలో మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ ద్వారా క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఒక్కటే కాదు.. క్రమశిక్షణ, పట్టుదల, పోరాట స్ఫూర్తి కూడా ముఖ్యమే. యువత క్రీడల వైపు అడుగులు వేయాలి అని మంత్రి ఆకాంక్షించారు.

# పేదల సొంతింటి కలకు మరింత ఊతం

త్వరలో రెండు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు..
ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో వేగంగా భూ సర్వేదీర్ఘకాలిక
పెట్టుబడులకు ఆహ్వానం

**నిజామాబాద్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో కలిపి




రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, త్వరలో మరో రెండు విడతల్లో మరిన్ని ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణం, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు మహేష్‌కుమార్ గౌడ్తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పేదలకు కేటాయించే ఇంటి స్థలాలు భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో భూ సర్వే చేపడుతున్నామని మంత్రి తెలిపారు. నిపుణులు, రైతుల సూచనల మేరకు తొలుత 10 జిల్లాల్లోని 70 గ్రామాల్లో సర్వే ప్రారంభించామని చెప్పారు. నక్షాలు లేని 413 గ్రామాల్లోనూ సర్వే నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు.


సర్వే సమయంలో ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నామని, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు.

నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సూచనల మేరకు, నిజామాబాద్ ప్రజల కోరికకు అనుగుణంగా హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని పొంగులేటి ప్రకటించారు. ఇందుకోసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించి 10–15 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. నిజామాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని అర్హులైన పేదలను గుర్తించి విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు. కమీషన్లు, దందాలు, విషపూరిత ఆలోచనలతో వ్యవహరించే వారికి తాము ప్రాధాన్యత ఇవ్వబోమని తెలిపారు.

# ప్రసవం తర్వాత జ్ఞాపకశక్తి తగ్గుతుందా?

– 'మమ్మీ బ్రెయిన్'పై పెరుగుతున్న చర్చ
– హార్మోన్లు, నిద్రలేమి ప్రభావం
– చాలామందిలో తాత్కాలిక సమస్యే



**డెస్క్, ఆగస్టు 22 (వార్త సంధ్య):** ప్రసవం తర్వాత కొంతమంది మహిళలు వస్తువులు ఎక్కడ పెట్టారో మర్చిపోవడం, పనులు గుర్తుకు రాకపోవడం, ఏకాగ్రత తగ్గినట్లు అనిపించడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. దీనిని సాధారణంగా "మమ్మీ బ్రెయిన్" లేదా "బ్రెయిన్ ఫాగ్" అని పిలుస్తుంటారు. ఇది చాలామంది కొత్త తల్లుల్లో కనిపించే సాధారణ పరిస్థితి అని వైద్య నిపుణులు చెబుతున్నారు. గర్భధారణ, ప్రసవం సమయంలో శరీరంలో హార్మోన్ల స్థాయిల్లో పెద్ద మార్పులు జరుగుతాయి. ప్రసవం అనంతరం ఈ మార్పులు మెదడు పనితీరుపై తాత్కాలిక ప్రభావం చూపవచ్చు. అదనంగా శిశువు సంరక్షణ కారణంగా నిద్రలేమి, అలసట, ఒత్తిడి కూడా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గినట్లు అనిపించడానికి కారణమవుతాయి. కొత్తగా తల్లైన మహిళలు రోజంతా శిశువు అవసరాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. దీంతో ఇతర చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. ఇది మెదడు శాశ్వతంగా దెబ్బతిన్న సంకేతం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చాలా సందర్భాల్లో శిశువు పెరుగుతున్న కొద్దీ, నిద్ర మెరుగుపడుతున్న కొద్దీ ఈ సమస్య కూడా తగ్గిపోతుంది. పోషకాహార లోపాలు కూడా కొన్ని సందర్భాల్లో ఈ లక్షణాలను పెంచవచ్చు. ముఖ్యంగా ఇనుము, విటమిన్-బి12, ఫోలేట్ లోపం, రక్తహీనత, అలసట వంటి సమస్యలు ఉంటే జ్ఞాపకశక్తి మందగించినట్లు అనిపించవచ్చు. అందువల్ల ప్రసవానంతరం సమతుల్య ఆహారం తీసుకోవడం, వైద్యులు సూచించిన పోషకాహార మాత్రలను క్రమం తప్పకుండా వాడడం అవసరం. అయితే తీవ్రమైన నిరాశ, ఆందోళన, రోజువారీ పనులు చేయలేని స్థాయిలో ఏకాగ్రత లోపం, నిరంతర జ్ఞాపకశక్తి సమస్యలు ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి ప్రసవానంతర మానసిక ఆరోగ్య సమస్యల సంకేతాలు కావచ్చు. అలాంటి పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రసవం తర్వాత కనిపించే 'మమ్మీ బ్రెయిన్' చాలామందిలో తాత్కాలికమే. తగిన విశ్రాంతి, పోషకాహారం, కుటుంబ సభ్యుల సహకారం, సరిపడా నిద్రతో మెదడు పనితీరు సాధారణ స్థితికి చేరుకుంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొత్త తల్లులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టడం ఎంతో ముఖ్యమని వారు సూచిస్తున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.